# ఐదు నిమిషాలు

హిందీమూలం: మోహన్‌లాల్ మహతో వియోగి:

ఐదు నిముషాలు కేవలం ఐదే ఐదు నిముషాలు. సంసార సుఖాలను తనివి దీరా గోల్పోవాల్సిన అయిన, మృత్యుదేవత సహచరులైన పోలీసుల మధ్య బేడీలతో... భగవాన్!

చేదు అనుభవాలు కత్తులై నా గుండెలకు గుచ్చుకుంటున్నాయి. జరిగిందెవరికి చెప్పాలి? నా కరుణామయ గాథ వినే సహృదయులున్నారా? లేరు. ఉన్నా విని విననట్టుంటారు.

"ఇదంతా నీ దౌర్భాగ్యం సోదరీ! త్రికరణ శుద్ధిగా పైవాడిని ప్రార్థించు" మంటారు.

ఐనా అభాగ్యుల ఆవేదన నెవడు వింటాడు? కష్ట సాగరంలో కొట్టుకుపోతున్న వారికి అభయహస్త మందించే మానవేశ్వరుడెవడు? ఆకలితో మలమల మాడే అష్టదరిద్రులకే భగవంతుడు పట్టెడన్నం పెట్టాడు? హృదయవేదన కన్నీరై కారుతుంటే తుడిచేందుకు ముందుకొచ్చే దేవుడెవరు?

భగవంతుడు! హు! ఆయిన నందనవన విహారి. ప్రియపత్ని ఆజ్ఞా బద్ధుడు! భూలోకంలో స్వర్గసుఖాలను భవించే వాళ్లే ఆయన కనబడతారు. నాలాంటి అల్పజీవులకు దౌర్భాగ్యమే దైవప్రసాదము. పిలిస్తే పలికే జేష్టక్క అండ నుండగా భగవంతుని కొరకెందుకు గొంతు చించుకోవాలి? జేష్టక్క పిల్లవగానే వస్తుంది. వచ్చి ఏదో ఒక కొత్త ఆదప నెత్తి మీదుంచి చంకలెగరేస్తూ తమాషా

చూస్తుంటుంది.

నేనోసారి ఆవిణ్ని పిలిచాను. అష్టదరిద్రాగ్రేసర చక్రవర్తి యైన గ్యాడ్యుయేటుకు నన్ను ముడిపెట్టి ముసిముసి నవ్వులు విసిరింది.

రెండోసారి పిలిచా ... ఇద్దరు పిల్లల నిచ్చింది.

మూడోసారి పిలిచా ముచ్చటగా. వరదల్లో చిక్కుకున్న మనిషికి గడ్డిపోచలా దొరికిన మనిషిని హత్యకేసులో ఇరికించి జైలుకు పంపించింది. ఉరి శిక్ష వేయించింది.

అంత వరకు జరిగింది. ఇప్పుడెవర్ని ఏమని పిలవాలి?

దారిద్ర్యమే సమస్త నేరాలకు మూలమైతే అతణ్ని ఉరి దీయాల్సిందే. తుపాకి గుండుతో తుద ముట్టించాల్సిందే. కుక్కలతో అతని కండలు పీకించాల్సిందే.

కాని కాని....అతడు హంతకుడు కాడు: దరిద్రుడు అపరాధి కాడు. ఆకలితో నకనకలాడే అభాగ్యుడు గూండా కాదు. దైవోపహతుడు. అతణ్ని పాపి అనకండి. ఈ సమాజం చెక్కిన దౌర్భాగ్యశిల్పమనండి.

ఇంతకీ అతనేంచేశాడనీ? అతడు చేసిన ఘోరమైన అపరాధమేమిటి? ఏమీలేదు. పాప కూపం పొట్ట కొరకు, దరిద్ర దేవతను తరిమేసేందుకు, అంగలార్చుస్తున్న పసి పిల్లల ఆకలి చూపులు భరించలేక ఇంత పని చేశాడు. దీనికే చట్టం అతణ్ని ఖూనీ కోరంది. నేరస్తుడని కే లేసింది. ఆ అమాయక చక్రవర్తిని ఉరికంభమెక్కించేందుకు ఏర్పాట్లన్నీ జరుగుతున్నాయి

ఫరవా లేదు.... ధైర్యంగా చెప్పగలుగుతాను. అతడు మృత్యుముఖంలోకి పోయినా ఫరవా లేదు. అతడు ఉరికంభ మెక్కినా ఫరవా లేదు. కాని ... అతడు నిరపరాధి. అదే నాకు సంతోషం. వందసార్లు కాదు; వెయ్యిసార్లు ఎలుగెత్తి చెబుతా అత డు పాపాత్ముడు కాడని: ఆకలితో అలమిటించే అభాగ్యుడు.... ఐనా మనిషే.

క్షుద్బాధకు తట్టుకోలేక దుస్సాంగత్యం శరణ్య మన్నాడు. దొరగా తిరుగుతున్న గజదొంగ కుత్తుక నుత్తరించాడు. దొంగ నిలువల్ని లూటీ చేశాడు. ఎన్నో చేశాడు ... అన్నీ పొట్ట కొరకే నైతికంగా అతడు దొంగ, ఖూనీకోరు కాని ... సాటి మని షిగా ఆలోచించండి ... నైతిక విలువలనేవి ఈ సమాజంలో కేవ లం దరిద్రులకేనా?

.. రామథన్.... ఊళ్లోని సన్నకారు రైతుల పొలాలన్నీ వడ్డీలకింద వేలిముద్రల సాక్షిగా లాగేసుకున్నాడు. వాని పాప కృత్యాల నీడల్లో వందల కొద్దీ దరిద్రుల పిల్లలు చావుబడిలోకి చేరారు. ఇది పాపం కాదా? నేరం కాదా?? పాపమినేది నా బీద మగని అపరాధానికి మారు పేరా? పోనీ అతన్ని లోకం నుండి తరిమేస్తే పాపలోక ద్వారాలు మూసుకుంటాయా? లేదు.... ఎన్నటికీ మూసుకోవు.

* * * *

నిన్న ప్రభుత్వం నుండి నాకొక ఉత్తరం అందింది. నా భర్త నన్ను చూడాలన్నాడట: ఇదే మా చివరి కలయిక. ఆ

తర్వాత కొన్ని గంటల్లో అతన్ని ఉరికంభమెక్కిస్తారు. అతని చివరి కోరిక.... అతని మారు రూపాలైన పిల్లల్ని చూడాలని.

నా పతిదేవుని అంతిమ దర్శనానికెళ్లాను. కాదు.... ప్రాణేశ్వరుని జీవచ్ఛవాన్ని పలుకరించేందు కెళ్లాను.

చావనేది ప్రతిప్రాణికి చెప్పకనే వచ్చి చుట్టుకుంటుంది కాని నా భర్తకు చెప్పి వస్తుంది. అతని కొరకు ఉరితాడు తయారైంది. అతని శవంపై కప్పేందుకు గుడ్డగూడా కొనేశారు, అతని కళ్ల ముందే భగవాన్ !

నువ్వే చెప్పుసోదరీ ! జీవన సర్వస్వమైన నీప్రియుడు చావులోకానికెల్తున్నాడంటె నువ్వెక్కడున్నా చూడ్డానికెళ్లవా? ఈ రోజు నేను చూస్తున్న నా ప్రియుని కంఠాన్ని రేపు యమ పాశం నులిమేస్తుంది.

నిజమైన చట్టాన్ని నేను దోషిగా నిలబెట్టను. న్యాయం పైన దాడి చేయను. కాని ... స్వచ్ఛమైన మానవత్వంతో అడుగుతున్నాను చెప్పు సోదరీ! ఒక్కసారి చెప్పు సోదరీ ! న్యాయం మూగది, గుడ్డిది. దానిముందు నిలుచున్న వారికే దాని నిజ స్వరూపం తెలిసి పోతుంది, కాని నీకూ హృదయముందిగదా, చెప్పుసోదరీ!

నా అనేదాన్ని విడిచిపెట్టి వెళ్లాను. ఒక్కసారి అతని చరణ కమలాలను ముద్దాడాలనీ, ఒక్కసారి అతని విశాల వక్షస్థలమ్మీద తలదాచుకుందామనీ....

"దేవుడా! నా కొరకు ఎదిరి చూస్తావుగదూ! మరిచి పోవు

గదూ! జాజ్వల్య మానమైన నీ యౌవనంలో ఈ అభాగ్యురాల
ఆజ్యం పోసింది. నీ యౌవ్వన పాత్రలో విషం క్షీరం గరించింది
క్షమించండి.... మీ కొడుకు నొక్కసారి పిలవండి. ఒక్కసారి
పితృవాత్సల్య శీతల జలాలతో వాడి నభిషేకించండి. వీడే మీర
నాకు మిగిల్చిన ధనం...." అందా మనుకున్నాను.

జైలు వైపుకునడిచాను. ఒడిలో పిల్లవాడు

"అమ్మా ఎక్కలి కెల్తున్నామమ్మా?"

ఏం జవాబివ్వాలి?

"మీనాన్నని చూసేందుకు. ఆయన మిమ్ముల్ని చూడా
ని కోరాడటరా!" అనగలిగాను.

"అమ్మా! శాన రోజుల నుండి నాన్న ఇంటికే రాలేదు
బొమ్మలడుగుతా, డబ్బులడుగుతా ... ఒక్క బొమ్మగూడా
మున్నికివ్వను." అన్నాడు గోపాల్-బుడతడు. నా హృదయం
వికలమై పోయింది.

"అయ్యో దౌర్భాగ్యమా! రేపి వరకు మీనాన్న మృత్యు
సాగరంలో మునిగిపోతాడు. అతడిప్పుడు జీవితంలోని అంతిమ
ఘడియల్ని లెక్కించుకుంటున్నాడు. దేవుణ్ని ప్రార్థించ
నాన్నా!" అన్నాను.

గోపాల్ నా కొంగు గుంజి అన్నాడు "నాన్న ఎప్పుడొ
స్తాడో.... ఫెంబడి తీసుకొస్తా నువ్వొద్దనద్దమ్మా. నాన్నను గోవింద్
వాళ్లటు వంటి సైకిల్ తెమ్మంటానమ్మా. గోవింద్ వాళ్లు నన్ను
వాళ్ల సైకిల్ ముట్టనివ్వరమ్మా ఎందుకో ... ముట్టగానే సైకిల్

విరిగి పోతుందా? వాడొట్టి గర్విష్టమ్మా! నేను గూడా వాణ్ని నా కొత్త సైకిల్ ముట్టనవ్వను మున్నీని గూడా ముట్టనివ్వ. అది నా పలక విరగ్గొట్టింది. వద్దంటే పండ్లు కొరకుతుంది నేను నాన్నతో చెప్తా"

❋ ❋ ❋ ❋

"తీసికెళ్లు!" జైలర్ పర్మిషనిచ్చాడు.

సిపాయి వెంటవెళ్లాను. ప్రాణాలతో చెలగాట మాడే మృత్యుశాల జైల్లో రెండు వైపులా గదులు .. పొడవైన కటకటాలు .. వాటివాధ్య ఈశ్వరుడు సృష్టించిన అరవైనాల్గు కళలకు నమూనాలైన మానవుడు. హుం.... మానవుడు దానవుడు .. మనుష్యులు ఒకరిద్దరు కాదు ... వందల కొలది. ఈ విశాల విశ్వంలో నేనొక్కదాన్నే అభాగ్యురాలిని కాదు. వేలకొలది, లక్షల కొలమున్నారు.

కాళరాత్రిని తలదన్నే అంధకార బంధురమైన ఒక గది ముందు నిల్చున్నాను. గోపాల్ భయంతో నా కాళ్లను చుట్టేసి నిల్చున్నాడు వాడు ముడుచుకు పోతున్నాడు.

"పాంకాళ్!" సిపాయి కేక

నాల్గు వైపులా చూశాను వెర్రిగా

ఇది ఉరిదసే ఖైదీల గది. జీవితం చివరిక్షణాలను వేళ్ల మీద లెక్కించుకునే...నా భర్తలాంటి వారి నిందులో ఉంచుతారట

ఈ గదికే మాటలొస్తే సాహిత్యంలో ఇదివరకకే కవీ వ్యక్తం చేయలేని శోకరాగాలనందించేది. చేయని పాపాలకు,

విధిలేక చేసిన పాపాలకు కఠిన శిక్షలనుభవించే ఈ మానవుల గుండెల్లో ప్రజ్వలించే అగ్ని మాత్రం అలాంటిదికాదు.

ఝుణ్ ఝుణ్ మని సంకెళ్ల శంఖారావం వినబడింది. అలసి సొలసి అస్థిపంజరంలా తయారైన యువకుడు ప్రకాశ్.... నా చీకటి జీవితంలో చివరి కిరణం.... గోపాల్, మున్నీల భవిష్యత్తు నిర్దేశించే ప్రకాశ కిరణం.... నా ముందు, కటకటాల వెనక నిల్చున్నాడు.

"ఐదునిముషాలు మాట్లాడు కోండి అంతే" సిపాయి ఆదేశం

నేను మరికొద్ది దూరం జరిగి నిల్చోవాలని మరో ఆదేశం. ఖైదీకి నేనే మన్నా ఇస్తానేమోనని వాళ్ల భయం.

"గోపాల్! మీనాన్నకు నమస్కరించు బాబూ...." నా గొంతు వణికింది. ముక్కుపచ్చలారని ముద్దుబిడ్డ భూమాతకు తలానించి పితృదేవతకు నమస్కరించాడు. నేనూ నమస్కరించా నలాగే.

అటువైపు మసక వెలుతురో ప్రకాశ్. వరద లొచ్చిన నదుల్లా ప్రవహిస్తుందతని కన్నీరు. దాన్నాపుకునే ప్రయత్నం చేస్తున్న ట్టుంది అతని పెదాలు కదిలాయి.

"సు ఖం....గా ఉండు. ఇది చివరి కలయిక. చివరి ఆశీర్వాదం. చివర్ని మాటలు చా....లు. ఉదయమే వచ్చి నా శవాన్ని తీసుకెళ్లు."

కాల్చిన గడ్డపారలతో గుండెకు వాతలు పెడుతున్న ట్టనిపించింది. అంతా అయోమయం. తల పట్టుకు కూలబడ్డాను.

"పోదాం పద నాన్నా!" గోపాల్ పిలుపు.

వాతలు పెట్టిన గుండెలకు పిడి గుద్దులు వడ్డించి నట్టనిపించింది. పాపం! కల్లా కపటం తెలీని అమాయకుడు.

"నేను వేరే లోక యాత్రికుణ్ని నాన్నా! నీవు బాగా చదువుకో. అమ్మను కష్టపెట్టొద్దు ..." కన్నీరు మున్నీరు.... ఆయన మాటలు . నాహృదయం బద్దయం బద్దలైంది.

"చూడు నాన్నా! మున్ని ఏడుస్తుంది. అది నా పలక పలగ్గొట్టింది. వాకింకో పలక కొనివ్వునాన్నా!" గోపాల్ గోల.

నా జీవనజ్యోతి నార్పేయబోతున్న ప్రకాశ్ నోట మళ్లీ మాట పెగలింది.

"విన్నావుగా! గోపాల్‌కో కొత్త పలక కొనివ్వు!"

ఏం జవాబు చెప్పాలి? కళ్లముందు చీకటి తెరలు దిగుతున్నాయి. మళ్లీ మాట్లాడుతున్నాడు ప్రకాశ్.

"సరే ధైర్యంగా ఉండాలి. తండ్రి లేని పిల్లల్ని ప్రేమతో పెంచు. గోపాల్‌ను బాగా చదివించు. నేనైతే నా పిల్లల్ని పెంచలేని ఋభాగ్యుణ్నై ఈ లోకంలోంచే పారిపోతున్నాను; కాదు... కూటికి గతిలేని మనలాంటిపేదల గృహాల్లో పట్టపగలే నిండు అమావాస్య వ్యాపిస్తుండగా.... పెత్తందార్ల బంగళా పై అంతస్తుల్లో నిండు అమావాస్య రాత్రి పంటు వెన్నెల కురుస్తుంటే.... ఈ పాలనలో బ్రతకలేక చస్తున్నాను. కాని గోపాల్ మాత్రం నాలా తయారు కావద్దు. చింతించకు... జరిగేదేదో జరిగి తీరుతుంది."

హరి భగవంతుడా!


"ఇంకా.... ఇంకా...." రుద్ధ కంఠం నన్ను మాట్లాడనీయలేదు. రక్తం కన్నీరై బయటి కొస్తుంది.

"వెళ్లమ్మా ఐదు నిమిషాల టైమైపోయింది." సిపాయి ఆజ్ఞ.

ప్రకాశ్ చివరి మాటలు

"ఏదీ ఒక్కసారి నాతరఫున గోపాల్‌ను ముద్దెట్టుకో. భగవంతుడు దయదలిస్తే మళ్లీ జన్మలో కలుసుకుందాం."

"టైమైపోయింది" సిపాయి హుంకరింపు.




28680